అధ్వానంగా బీటీ రోడ్డు



ఉప్పునుంతల–మర్రిపల్లి గ్రామాల మధ్య కంకర తేలిన బీటీ రోడ్డు

ఉప్పునుంతల: మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వరకు ఉన్న నాలుగు కిలోమీటర్ల బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. కంకర తేలడంతో పాటు గుంతలు ఏర్పడ్డాయి. బీటీ రోడ్డు నిర్మించినా నిర్వహణ లేక రోడ్డు అస్తవ్యస్తంగా తయారైంది. రోడ్డు సరిగ్గా లేక ఆయా గ్రామాల ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, విద్యార్థులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు మార్గం ద్వారా మండల కేంద్రం నుంచి మర్రిపల్లి, ఉప్పరిపల్లి మీదుగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి రాకపోకలు కొనసాగిస్తారు. రోడ్డు అభివృద్ధి చేయడానికి బీటీ రెన్యూవల్ కోసం మెయింటెన్స్ ఆఫ్ రూరల్ రోడ్స్ పథకం కింద రూ. కోటి నిధులు మంజూరయ్యాయి. గతంలో రెండు మూడు పర్యాయాలు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కృషితో కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకొని అగ్రిమెంట్ చేసుకున్నాడు. ప్రస్తుతం పనులు చేయడానికి అనుకూల సమయం ఉన్నా కాంట్రాక్టర్ పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని ఉర్దూఘర్ ఫంక్షన్‌హాల్‌లో సంఘం జిల్లా కార్యదర్శి సుందర్‌చారి ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హరికుమార్, సెక్రెటరీగా యాదయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రజావాణికి హాజరు కావాలి

కోడేరు: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని డిప్యూటీ తహసీల్దార్ జయలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఏమైనా సమస్యలుంటే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రీజనల్ చైర్మన్‌గా సత్యనారాయణ

మన్ననూర్: రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రీజనల్ చైర్మన్‌గా జూలూరు సత్యనారాయణ నియామకం అయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరాబాది లక్ష్మీనారాయణ ఎంపిక చేస్తూ సంఘం కేంద్ర కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. మన్ననూర్ గ్రామానికి చెందిన సత్యనారాయణ స్థానిక విలేకరులతో మాట్లాడారు. తనపై ఉన్న నమ్మకంతో గతంలో రాష్ట్ర టూరిజం చైర్మన్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా నియమించారని ప్రస్తుతం రీజనల్ చైర్మన్‌గా నియామించారని పేర్కొన్నారు.

సేవలకు పురస్కారం

కల్వకుర్తిరూరల్: సామాజిక సేవలకు గుర్తింపుగా లయన్స్ క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు, అభిలాష హెల్పింగ్స్ లయన్స్ ఆర్గనైజేషన్ నిర్వాహకుడు రమేష్‌ను మదర్‌థెరిస్సా లైఫ్‌టైం అచీవ్ అవార్డుతో సత్కరించారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో శర్మ అవార్డును అందించారు. నిర్వాహకురాలు డాక్టర్ రోజనమ్మ, క్లబ్ కార్యదర్శి శ్రీధర్, తర్నికల్ శ్రీనివాస్, రఘులు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కల్వకుర్తిరూరల్: గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని సర్పంచ్ శ్రీలత అన్నారు. ఆదివారం మండలంలోని తోటపల్లి ఎస్సీ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో రాజేష్‌రెడ్డి, అనీల్‌కుమార్, వార్డుసభ్యులు, కార్యదర్శి లింగం పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని రఘుపతిపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన వినయ్ బైక్‌పై రఘుపతిపేట నుంచి కల్వకుర్తికి బయలుదేరాడు. జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ సంబంధించిన కారు రఘుపతిపేట వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు కారును బైక్ ఢీకొన్నది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న వినయ్‌కు గాయాలయ్యాయి. బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం యెన్నమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదకరంగా రోడ్లు



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలను కలిపే లింకురోడ్లు ప్రమాదకరంగా మారాయి. గతేడాది కురిసిన వర్షాలకు రోడ్డు పక్కల వరద తాకిడికి మట్టి కొట్టుకుపోయింది. మండలంలోని గోవిందాయిపల్లి సమీపంలో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన గుంత ఏర్పడి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. అదేవిధంగా మండల కేంద్రం సమీపంలో ప్రధాన డబుల్ రోడ్డుపై కల్వర్టు దెబ్బతింది. దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఎప్పుడు ఏప్రమాదం చోటుచేసుకుంటుందోనని బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని వాహనదారులు వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ధర్మాన్ని కాపాడటమే వీహెచ్‌పీ లక్ష్యం



ఆలయంలో వీహెచ్‌పీ, కాంగ్రెస్ నాయకులు

మన్ననూర్: ధర్మాన్ని కాపాడటమే వీహెచ్‌పీ లక్ష్యమని విశ్వహిందు పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సంబు వెంకటరమణ అన్నారు. ఆదివారం లింగమయ్యస్వామి ఆలయంలో అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధతో పాటూ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంబు వెంకటరమణ మాట్లాడుతూ హిందు ధర్మంలో ఆచారంతో పాటూ సైన్స్ కూడా దాగి ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల వారు వీహెచ్‌పీలో పనిచేస్తున్నారన్నారు. ఏ రాజకీయ పార్టీకి అనుకూలం, వ్యతిరేకం కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు పంబలి బుచ్చయ్య, వెంకటరమణ, సంబు శోభ, బాలమ్మ, సుజాత, చిట్టెమ్మ, అలివేల పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న అనిల్

కల్వకుర్తిరూరల్: ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం విఫలం అయ్యిందని బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ అనిల్ ముదిరాజు అన్నారు. ఆదివారం పట్టణంలో బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. ఆమన్‌గల్ నుంచి బైక్‌ర్యాలీ ప్రారంభమవుతుందని మధ్యాహ్నం కల్వకుర్తికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో మల్లేష్, పరుషరాం, శేఖర్ రెడ్డి, సాయికుమార్, లక్ష్మీనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు ఓటుహక్కు పొందాలి



లింగాల పోలింగ్ బూత్‌లో ఓటరు నమోదు చేయించుకుంటున్న ప్రజలు



వెల్దండలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ రవికుమార్

వెల్దండ: 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ, యువకులందరు ఓటుహక్కు పొందాలని తహసీల్దార్ రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గుండాలలో ఆయన పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లోని బీఎల్‌ఓలను సంప్రదించి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో మొత్తం 90 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, ఆర్‌ఐలు శంకర్‌నాయక్, శైలజ, బీఎల్‌ఓలు ఉన్నారు.

కొనసాగుతున్న ఓటరు నమోదు

లింగాల: మూడు రోజుల పాటు చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు మండలంలో ముమ్మరంగా కొనసాగుతుంది. ఆదివారం రెండోరోజు అధికారులు పోలింగ్ బూత్‌ల వారిగా కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు చేశారు. అర్హత గల యువతీ యువకులు పేర్లను నమోదు చేయించుకోవాలని అధికారులు గ్రామాలలో ప్రచారం చేస్తున్నారు.

యూత్ కాంగ్రెస్ బలోపేతానికి పాటుపడదాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కొల్లాపూర్: యూత్ కాంగ్రెస్ బలోపేతం కోసం పనిచేస్తామని ఆ సంఘం యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వంగ రాజశేఖర్‌గౌడ్, కౌన్సిలర్ రహీంపాషా అన్నారు. ఆదివారం పట్టణంలోని జూపల్లి కృష్ణారావు కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు కష్టపడి పనిచేయాలన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో యువతకు అన్యాయం చేసిందన్నారు. నాయకులు వేణుగోపాల్‌యాదవ్, రెడ్డి సత్యం, కర్నె శివ, నర్సింహ, మహేష్‌యాదవ్ తదితరులున్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



తెలకపల్లి: మండలంలోని చిన్నముద్దునూర్‌లో మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆదివారం బీజేపీ నాయకురాలు కొండ మణెమ్మ ఆధ్వర్యంలో గడప గడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ మణెమ్మ దంపతులు ఇంటింటికి వెళ్లి ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కొండ మణెమ్మ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ధ్యేయం



తాడూరు: పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని సర్పంచ్ అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని బలాన్‌పల్లిలో రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్ ద్వారా మంజూరైన నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ ప్రారంభించారు. అదే విధంగా ఐతోలు, అంతారం, పాపగళ్ళు, ఆయా గ్రామాలలో సీసీ రోడ్ల పనులు ముమ్మరం చేశారు. అదేవిధంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను చేపట్టారు.

నిలిచిన డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు



తాడూరులో నిలిచిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు

తాడూరు: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయం సమీపంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులను 2021 ఆగస్టు 13వ తేదీన ప్రారంభించారు. 104 ఇళ్ల నిర్మాణ లక్ష్యంగా రూ.524.16 లక్షల అంచనాతో నిర్మాణ పనులు చేపట్టారు. ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కాకపోవడంతో ఇళ్ల నిర్మాణ పనులు పునాదులకే పరిమితం అయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ తీసుకొని నిధులు మంజూరు చేయించడంతో పాటు నిర్మాణ పనులను పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థికి సుహాసన్‌రెడ్డి దరఖాస్తు



బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బిజినేపల్లి మండలానికి చెందిన యువ నేత కూచుకుళ్ల సుహాసన్ రెడ్డి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

దేవాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న సంజీవ్‌కుమార్

వెల్దండ: మండలంలోని సిలోనిబావితండాలో నూతనంగా నిర్మిస్తున్న పోషమ్మ, హనుమాన్ దేవాలయాల నిర్మాణాలకు సింగిల్‌విండో వైస్ చైర్మన్ సంజీవ్‌కుమార్‌యాదవ్ రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులకు చెక్కు అందజేశారు. ఆలయ నిర్మాణాలకు దాతలు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో పోతేపల్లి సర్పంచ్ వావిళ్ల వెంకటమ్మ, నాయకులు లక్ష్మణ్‌నాయక్, మంగ్యానాయక్, రవి, తుకారం, లచ్చిరాం, రామునాయక్ తదితరులు ఉన్నారు.

బైక్ ర్యాలీ విజయవంతం చేయండి

వెల్దండ: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే బీజేపీ బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నాటక రాష్ట్ర మంగళూరు ఎమ్మెల్యే భరత్‌శెట్టి హాజరవుతారని పేర్కొన్నారు. ఆమనగల్లు నుంచి బైక్ ర్యాలీగా వెళ్లి కల్వకుర్తికి చేరుకుంటుందని వివరించారు. అక్కడ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తునట్లు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

కారు, బస్సు ఢీ: ఇద్దరికి గాయాలు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ సమీపంలో ఆదివారం రాత్రి హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై బస్సు, కారు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాంద్ర గ్రామానికి చెందిన ఎగిలిశెట్టి యాదగిరి, కుమారుడు ప్రమోద్ కారులో హైదరాబాదు వెళ్తున్నారు. మార్గమధ్యలో పెద్దాపూర్ సమీపంలో ముందు వెళ్తున్న మరోకారును దాటే క్రమంలో ఎదురుగా వస్తున్న కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న యాదగిరి, ప్రమోద్‌లకు గాయలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు.

ధ్యానం దినచర్యలో భాగం కావాలి



పట్టణంలో నిర్వహించిన శాకాహార ర్యాలీలో పాల్గొన్న పిరమిడ్ మాస్టర్లు

అచ్చంపేట రూరల్: ధ్యానం దినచర్యలో భాగం కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని నాగర్‌కర్నూల్ వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మించిన సాయి పిరమిడ్ ధ్యాన మందిరాన్ని ప్రభుత్వ విప్ దంపతులు గువ్వల బాలరాజు అమల ప్రారంభించారు. ఈ సందర్భంగా ధ్యాన మందిరం నుంచి లింగాల చౌరస్తా వరకు నిర్వహించిన శాకాహార ర్యాలీలో వారు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ధ్యానం చేయడం ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయన్నారు. శాకాహారంతో ఆరోగ్యం కలుగుతుందన్నారు. మారుమూల ప్రాంతంలో ధ్యాన మందిర ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ, బీజేపీ నాయకుడు సతీష్ మాదిగ, గురువు బిచ్చమయ్య, పరిణత ప్రతీజీ, మారం శివప్రసాద్, దామోదర్‌రెడ్డి, పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న మినీ అంగన్‌వాడీ టీచర్లు

కల్వకుర్తి టౌన్: మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో మున్సిపల్ చైర్మన్ సత్యం, మినీ అంగన్వాడీ టీచర్లతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మినీ అంగన్వాడీ టీచర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 216 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్ అయ్యాయన్నారు. సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కార్యదర్శి సరోజ, టీచర్లు ప్రమీల, భాగ్య, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బీఎంఎస్ మహాసభలకు తరలిన నాయకులు



తాడూరు: జిల్లా కేంద్రం నుంచి బీఎంఎస్ 10వ రాష్ట్ర మహాసభలకు ఆదివారం ఆ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ విజయ్ ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధానిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న బీఎంఎస్ మహాసభలకు జాతీయ అధ్యక్షుడు వామన్ నేత్రం హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల నుంచి మహాసభలకు తరలివెళ్లినట్లు పేర్కొన్నారు. నాయకులు నరేందర్, ఉస్సేన్, భాస్కర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బిజినేపల్లి: పూర్వపు వీఆర్‌ఓల సమస్యలు పరిష్కరించాలని జిల్లా టీజీవో ప్రధాన కార్యదర్శి బాగవేణి నర్సింహులు కోరారు. ఆదివారం పాలెం ప్రభుత్వ కళాశాల ఎదుట పూర్వపు వీఆర్‌ఓలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపార్ట్‌మెంటల్, సర్వేయర్, అకౌంట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వీఆర్‌ఓలకు పదోన్నతులు కల్పించలేదన్నారు. కార్యక్రమంలో పూర్వపు వీఆర్‌వోల సంఘం నాయకులు రఘు, రమేష్, శ్రీనివాసులు, సుధాకర్, నాగయ్య, వేంకటేష్, బాలరాజు, నరసింహ్మా, రాజేష్, శ్రీను పాల్గొన్నారు.

అనారోగ్యంతో పురోహితుడు మృతి

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన పురోహితుడు కాకునూరి వెంకటయ్యశేసయ్య శర్మ(91) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు, రేణుక, నాగరాజు, శశికళ, శివశంకర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి, సుధాకర్ సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు



ఉప్పునుంతలలో బోనాలతో ర్యాలీగా వస్తున్న మహిళలు

ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో పెద్దమ్మతల్లి బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ మహిళలు ముందుగా పోచమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం యాదవుల కులదైవం పెద్దమ్మతల్లి ఆలయం వద్దకు బోనాలతో చేరుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి బోనం కుండల్లో తీసుకెళ్లిన నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. యాదవ సంఘం నాయకులు బాల్‌నారాయణ యాదవ్, కృష్ణయ్యయాదవ్, జంగయ్యయాదవ్, రాములు యాదవ్, పర్వతాలు యాదవ్, బుగ్గయ్యయాదవ్, బక్కయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోచమ్మ బోనాలు

లింగాల: మండలంలోని లింగాల, అంబట్‌పల్లి, కొత్తకుంటపల్లి గ్రామాల్లో సోమవారం పోచమ్మ బోనాలను నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోనేటి తిర్పతయ్య, రవిశంకర్, పర్వతాలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం వనప్రయాసం ఉంటుందని వారు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి కోట మైసమ్మదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమన్వయంతో పనిచేయాలి



గోపాల్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త ప్రమోద్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కార్యకర్తలు టీఆర్‌ఎస్ అభ్యర్థి నిరంజన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్య, జెడ్పీటీసీ భార్గవి, మండల పార్టీ అధ్యక్షుడు కోదండం, నాయకులు తిరుపతియాదవ్, కోటిరెడ్డి, శ్రీనివాసులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



నినాదాలు చేస్తున్న నాయకులు

కొల్లాపూర్: మండల కేంద్రంలో 9,12,16 వార్డులకు చెందిన యువకులు ఆదివారం ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అదేవిధంగా కొండూరు గ్రామానికి చెందిన 50 మంది జూపల్లి వర్గీయులు బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత, రైతులు పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు, మార్కెట్ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు సాంబశివుడు, జాఫర్, రుక్మద్దీన్‌తో పాటు పలువురున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం



కల్వకుర్తిరూరల్: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంగా మారిందని బీఆర్‌ఎస్ నాయకుడు సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాంద్ర గ్రామంలో రాఘవరెడ్డికి రూ.లక్ష, కొండల్‌యాదవ్‌కు రూ.24 వేలు మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో చెక్కులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కిష్టయ్య, చారి, సుమన్, పరుషరాములు తదితరులు పాల్గొన్నారు.